క్లుప్తంగా

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారు

చీరాల టౌన్: భక్తుల కొంగు బంగారం.... కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. బాపట్ల, ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామాన్ని సుభిక్షంగా ఉంచడంతో పాటు కోరిన కోర్కెలు తీర్చే పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

విష జ్వరాలపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో వైద్యులు

ఇంకొల్లు(చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో ఇంకొల్లులో ఆదివారం నరాలకు సంబంధించిన సమస్యలు, విషజ్వరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు చంద్ర హాస్పిటల్ వైద్యులు నల్లమోతు శరత్ చంద్ర కుమార్ పర్యవేక్షణలో ఇంకొల్లు ప్రాథమిక వైద్యుల సంఘం సహకారంతో నరాలకు సంబంధించిన, విషజ్వరాల నివారణ గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ శరత్ చంద్ర, డాక్టర్ అరుణ్ చీరాల డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్, ఇంకొల్లు మండల ప్రాథమిక వైద్యుల సంఘం గౌరవాధ్యక్షుడు షేక్ ఉమ్రాన్, మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీలు, క్లబ్ అధ్యక్షుడు బలగం కోటేశ్వరరావు, సెక్రటరీ అలవల రాఘవరెడ్డి, ట్రెజరర్ గోరంట్ల కోటేశ్వరరావు, రొటేరియన్ నిమ్మగడ్డ హనుమంతరావు, సోమేపల్లి రామ్మోహనరావు, వత్సవాయి రాఘవ రాజు, షేక్ మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ కమిటీ ఎన్నిక


కారంచేడులో అమ్మవారి ఆలయ నూతన కమిటీ సభ్యులు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు శ్రీ వైష్ణవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. కమిటీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారు. నూతన కమిటీ ఎన్నికకు ఒక్క నామినేషన్ సెట్ మాత్రమే వచ్చింది. గత పాలకవర్గ కమిటీ మాత్రమే మరలా తిరిగి ఎన్నికైంది. కమిటీ అధ్యక్షునిగా అమరా ఆంజనేయులు, ఉపాధ్యక్షునిగా ఏల్చూరి శ్రీనివాసరావు, కార్యదర్శిగా ముప్పవల కాశీవిశ్వనాథం, కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నాగిరెడ్డికి 'ప్రజా సంకల్ప సేవారత్న' పురస్కారం


పురస్కారం అందుకుంటున్న నాగిరెడ్డి

కారంచేడు: మండలంలోని యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన మదర్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మున్నంగి నాగిరెడ్డికి 'ప్రజా సంకల్ప సేవారత్న' పురస్కారం లభించింది. ఆదివారం వైఎస్సార్ కడప జిల్లా ఐటీఐ సర్కిల్ శ్రీహరి జూనియర్ కాలేజ్ మీటింగ్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆయనకు సంస్థ నిర్వాహులు ఈ పురస్కారం అందించారు. ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర స్థాయిలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని గుర్తించి ఈ అవార్డులను అందించినట్లు నాగిరెడ్డి తెలిపారు. ప్రజా సంకల్ప వేదిక జాతీయ అధ్యక్షుడు, ఏపీ హైకోర్టు న్యాయవాది మదెర రంగసాయిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


బల్లికురవ, అద్దంకి రోడ్డులో దమ్ముల చక్రాల వల్ల పగుళ్లు ఇచ్చిన రోడ్డు


మేదరమెట్ల- నార్కెట్‌పల్లి నామ్ రహదారిలో కొప్పరపాడు సమీపంలో యథేచ్ఛగా వెళుతున్న దమ్ము ట్రాక్టర్

దమ్ముతో ధ్వంసం

- తారురోడ్లపై యథేచ్ఛగా దమ్ము ట్రాక్టర్లు
- ఛిద్రమౌతున్న రోడ్లు
- రబ్బరు తొడుగులపై అవగాహన కల్పించినా పట్టించుకోని యజమానులు
- వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో పదుల సంఖ్యలో రోడ్లపై స్వైర విహారం

బల్లికురవ: కొందరు ట్రాక్టర్ యజమానుల బాధ్యతా రాహిత్యం విలువైన రోడ్లను ధ్వంసం చేస్తున్నాయి. వ్యవసాయ సీజన్ ఆరంభం కావడంతో ట్రాక్టర్లకు మాగాణి దమ్ము చేసే చక్రాలు తగిలించుకొని రోడ్లపైకి వచ్చేస్తున్నారు. అవి ఇనుముతో చేసిన చక్రాలు కావడంతో తారు రోడ్లు కోతలకు గురై చిన్నాభిన్నం అవుతున్నాయి. ఫలితంగా ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. దీనిపై రైతులకు అవగాహన కల్పించినా కొందరు నిర్లక్ష్యంగా రోడ్లపైకి అలాగే వస్తూ కోట్లాది రూపాయల విలువైన ప్రజాధనాన్ని నాశనం చేస్తున్నారు. లింకు రోడ్లతో పాటు మేదరమెట్ల - నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై కూడా ట్రాక్టర్‌లు రాకపోకలు సాగిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. దమ్ము చక్రాలను పొలాల వద్దకు తీసుకొని అక్కడ ట్రాక్టర్‌కు అమర్చుకుంటే ఎలాంటి నష్టం వాటిల్లదు. కానీ ఆయా గృహాల వద్ద బయలుదేరేటప్పుడే దమ్ము చక్రాలు అమర్చుకోవడం ఇంతటి నష్టానికి కారణం అవుతోంది.

ప్రధాన పంట వరి

నాగార్జున సాగర్ ఆయకట్టు కింద వైదన, కొప్పరపాడు, కొత్తూరు, గొర్రెపాడు, కూకట్లపల్లి, ఎస్ఎల్ గుడిపాడు, ముక్తేశ్వరం, చెన్నుపల్లి, కొమ్మినేని వారిపాలెం, వల్లాపల్లి, అంబడిపూడి, గుంటుపల్లి, నక్కబొక్కలపాడు, గ్రామాల్లో సుమారు 12 వేల పైగా ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఆగస్టు నుంచి జనవరి వరకు ఖరీఫ్, రబీల్లో రెండు దఫాలుగా వ్యవసాయ పనులు సాగుతుంటాయి. ప్రతి గ్రామంలోని 20 నుంచి 30 ట్రాక్టర్‌లతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చిన ట్రాక్టర్లు రోడ్లపై తిరుగుతుంటాయి. దీనివల్ల తారు రోడ్లతో పాటు సీసీ రోడ్లు కూడా ధ్వంసం అవుతున్నాయి.


చెన్నుపల్లిలో ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పిస్తున్న బాపట్ల డీఎస్పీ

రబ్బరు తొడుగులతో సమస్య దూరం

ప్రభుత్వం దమ్ము చక్రాలకు ఉపయోగించే రబ్బరు తొడుగులను రాయితీపై ట్రాక్టర్ యజమానులకు అందించాల్సిన అవసరం ఉంది. అలాగే వాటి వినియోగంపై గ్రామాల వారీగా అధికారులు అవగాహన కల్పిస్తే రోడ్లు దెబ్బతినే అవకాశం తగ్గుతుంది. ఇలాంటి జాగ్రత్తల గురించే తెలియకపోవడం వల్లే ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు రోడ్లపైకి వస్తున్నారు. ఇటీవల చెన్నుపల్లి గ్రామంలో పోలీస్ శాఖ ఆర్అండ్‌బీ అధికారుల ఆధ్వర్యంలో బాపట్ల డీఎస్పీ జి. రామాంజనేయులు, సంతమాగులూరు సీఐ కె. వెంకటరావు, ఆర్అండ్‌బీ జేఈ కె. బాబ్జి.. 4 గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలు మిగిలిన గ్రామాల్లో ఏర్పాటు చేస్తే రోడ్లు దెబ్బతినే అవకాశం తగ్గుతుంది.


అభివృద్ధి చేసిన చెన్నుపల్లి - వైదన రోడ్డు

రహదారులపై దమ్ము ట్రాక్టర్‌లు ఉంటే కేసులు నమోదు చేస్తాం


వై. నాగరాజు, ఎస్సై

గ్రామాల్లోని తారు రోడ్లపైకి దమ్ము ట్రాక్టర్లు వస్తే పెనాల్టీతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్సై వై. నాగరాజు హెచ్చరించారు. దమ్ము ట్రాక్టర్లు తిరుగుతుండటంతో రోడ్లు పగుళ్లు ఇచ్చి దెబ్బతింటున్నాయని.. పగుళ్ల వల్ల గోతులు ఏర్పడుతూ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. గ్రామాల వారీగా మహిళా పోలీస్, వీఆర్వో, పోలీస్ శాఖలతో కమిటీలు ఏర్పాటు చేశామని.. రోడ్లు పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

అయ్యవార్లు ఎక్కడుంటారో.. ఎప్పుడొస్తారో!

- స్థానికంగా నివాసం ఉండని అధికారులు
- రైలు వస్తేనే విధులకు హాజరు
- ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని అధికారులు, సిబ్బంది

చీరాల టౌన్: ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు జవాబుదారిగా ఉండాలి.. ప్రభుత్వ సిబ్బంది పనిచేసే ప్రదేశంలోనే నివాసం ఏర్పాటు చేసుకోవాలి. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించి సమయానికి విధులకు హాజరుకావాలి. కానీ ఆచరణలో మాత్రం అందుకు పూర్తిగా విరుద్ధంగా జరుగుతోంది. ప్రభుత్వ శాఖల్లోని అధికారులు, సిబ్బంది 10 మందిలో ముగ్గురు కూడా తాము విధులు నిర్వహించే ప్రాంతంలో నివాసం ఉండటం లేదు. అటెండర్ స్థాయి నుంచి గజిటెడ్ అధికారి వరకు ప్రభుత్వ నిబంధనలు పక్కన బెట్టి వారి సొంత ఊర్లనుంచి ప్రతి రోజూ రైళ్లు, తమ సొంత వాహనాలలో విధులకు హాజరవుతున్నారు. రైళ్ల ఆలస్యం కావడంతో అధికారులు, సిబ్బంది సైతం ప్రభుత్వం సూచించిన సమయానికి విధులకు హాజరు కావడం లేదు. కార్యాలయాల్లోని అధికారుల గదులు 11 గంటల తర్వాతే తెరచుకుంటున్నాయి. దీంతో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలు అయ్యవార్ల కోసం ఎదురుచూపులు చూస్తూనే ఉన్నారు. చీరాల ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఉన్న రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపఖజానా, హౌసింగ్, ఆర్అండ్‌బీ, ఎన్ఆర్ఈజీఎస్, ఎంపీడీవో, సబ్ రిజిస్ట్రార్ తదితర శాఖల కార్యాలయాలున్నాయి. అలానే ఉద్యానశాఖ, ఐసీడీఎస్, ఇరిగేషన్ శాఖల అధికారులతో పాటు ఆయా కార్యాలయాల్లో పనిచేస్తున్న అటెండర్లు సైతం ఉద్యోగం చేసే ప్రదేశంలో నివాసం ఉండటం లేదు. గ్రామానికి ముఖ్యమైన వీఆర్వో.. గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే పంచాయతీ సెక్రటరీ.. మండల అభివృద్ధికి కృషి చేయాల్సిన ఎంపీడీఓ.. గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను అమలు చేయించాల్సిన ఈవోఆర్డీ.. రైతులకు అన్ని రకాల సూచనలివ్వాల్సిన వ్యవసాయశాఖ, ఉద్యోగస్తులకు నెలవారీగా జీతాలు అందించాల్సిన ఉపఖజానా అధికారులు..ఇలా చెప్పుకుంటే చాలా ప్రభుత్వశాఖల అధికారులు చీరాలలో నివాసం ఏర్పరుచుకోవడం లేదు. వీఆర్వోలు వారికి కేటాయించిన గ్రామాల్లో కాకుండా చీరాల, కొత్తపేట, వేటపాలెం ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. కొంతమంది పంచాయతీ కార్యదర్శులు సైతం వారికి కేటాయించిన గ్రామాల్లో నివాసం ఉండకుండా చీరాల, తెనాలి, గుంటూరు, ఒంగోలు తదితర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే చీరాల మండలంలో చాలా అధికారులు వారికి కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉండకపోవడం, నిర్ణీత సమయానికి విధులకు హాజరుకాకపోవడంతో మండలంలోని గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల అధికారులు, సిబ్బంది పనిచేసే ప్రదేశంలో ఉండాలని అధికారులకు ఆదేశాల్చినా ఒక్క అధికారి కూడా స్థానికంగా నివాసం ఉండేందుకు కనీసం ఏర్పాట్లు చేసుకోలేదు. ఫలితంగా అయ్యవార్ల రాకకోసం అర్జీదారులు ఎదురు చూస్తూనే ఉన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించి గ్రామాలు, మండల ప్రధాన కేంద్రాల్లో ముఖ్య అధికారులు ఎప్పుడు నివాసం ఉంటారో వేచి చూడాలి.


వ్రతంలో పాల్గొన్న భక్తులు


గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

గిరి ప్రదక్షిణ

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖపుణ్యక్షేత్రమైన శింగరకొండపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి గిరిప్రదక్షిణ కార్యక్రమంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భాద్రపద పౌర్ణమి సందర్భంగా ఈ ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ఆలయం ముఖద్వారం నుంచి శింగరకొండ, గోపాలపురం మీదుగా భవనాశి చెరువు పక్కగా స్వామివారి కొండ చుట్టూ ప్రదక్షిణ చేశారు. చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ఆలయంలో అశ్వత్థ నారాయణ పూజ చేశారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు, ఈవో, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయం మూత..

చంద్రగ్రహణ సందర్భంగా ఆలయాన్ని మధ్యాహ్నం సమయంలో పూజల అనంతరం మూసివేశారు. మరలా నేటి ఉదయం సంప్రోక్షణ అనంతరం తెరువనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

అద్దంకి ఎంపీడీఓ బదిలీ



అద్దంకి రూరల్: అద్దంకి మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. సింగయ్య ఆదివారం బదిలీ అయ్యారు. డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరక్టర్‌గా పదోన్నతి పొందారు. సంవత్సరం నుంచి అద్దంకి ఎంపీడీఓ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రకాశం జిల్లా డ్వామా ఏపీడీగా పదోన్నతి పొందిన శింగయ్యను కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు హాజరు కావాలి

చీరాల టౌన్: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న పీజీఆర్ఎస్, రెవెన్యూ ఉద్యోగుల సమావేశానికి విధిగా రెవెన్యూ సిబ్బంది, అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని విచారణ వివరాలు, నీటి తీరువా వసూళ్లు, తదితర అంశాలకు సంబంధించిన సమాచారంతో హాజరు కావాలని గోపీకృష్ణ సూచించారు.

వీర రాఘవ స్వామి దేవస్థాన అభివృద్ధికి కృషి


దేవస్థాన చైర్మన్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న వాకర్స్ సభ్యులు

చీరాల రూరల్: వీరరాఘవస్వామి దేవస్థాన అభివృద్ధికి కృషి చేస్తానని దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మామిడాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఎన్నికైన శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ మాట్లాడారు. శ్రీనివాసరావు అనేక సేవాకార్యక్రమాలు చేయడంతో పాటు రోటరీ క్లబ్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా, వాకర్స్ సభ్యులుగా, జనసేన పార్టీ నాయకునిగా కూడా సేవలందిస్తున్నారని చెప్పారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకముంచి పదవి అప్పగించిన ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. దేవస్థాన అభివృద్ధికి తన శక్తిమేర కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో చారుగుళ్ల గురుప్రసాద్, నారాయణమూర్తి, వి. మురళీకృష్ణ, డీవీ సురేష్, డి. నారాయణరావు, ఎ. వీరాంజనేయులు, సీహెచ్. రమేష్, నాగవీరభద్రాచారి, జి. రమేష్, కె. నారాయణ, పుల్లయ్య నాయుడు, పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రహణంతో ఆలయాలు మూత


బల్లికురవ: మూతబడిన ఆలయం

బల్లికురవ: సూర్యగ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని 21 గ్రామ పంచాయతీలు 14 శివారు గ్రామాల్లోని వివిధ ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి తలుపులు మూశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ తదుపరి భక్తులకు స్వామి అమ్మవార్ల దర్శనంతో విశిష్ట పూజలకు అవకాశం కల్పించనున్నారు. ఆయా గ్రామాల్లోని ధర్మకర్తలు అర్చకుల ఆధ్వర్యంలో ఆలయాల్లోని ఉత్సవ విగ్రహాలను శుద్ధి చేసే కార్యక్రమాలు చేపట్టారు. గ్రహణం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అర్చకులు వివరించారు.

చినగంజాం: సంపూర్ణ చంద్రగ్రహణం పురస్కరించుకొని అన్ని ఆలయాలు మూసివేశారు. వైష్ణవ, శైవ దేవాలయాలతో పాటు ఇతర దేవాలయాలు దైవ మందిరాలు ఆదివారం మూసివేశారు. చంద్రగ్రహణ విరమణ అనంతరం సోమవారం ఉదయం సంప్రోక్షణ కార్యక్రమం అనంతరం ఆలయాలను యథావిధిగా తెరవనున్నట్లు అర్చకులు తెలిపారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అన్నదాత పోరు విజయవంతం చేయండి


చీరాల: అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇంకొల్లు(చినగంజాం): ఎరువులు, బ్లాక్ మార్కెట్‌పై ప్రభుత్వ తీరుకు నిరసనగా.. రైతన్నకు బాసటగా 9వ తేదీన నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు ఆదివారం కోరారు. పర్చూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలోని ఇన్‌చార్జ్ నివాస గృహంలో అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కన్వీనర్ చిన్ని పూర్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బండారు ప్రభాకరరావు మాట్లాడుతూ యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులు వెంటనే పంపిణీ చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి ఎరువులను పక్కదారి పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి అందరికీ వర్తింప జేయాలని, వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న ప్రాంతాల రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్లతో కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మైనార్టీ సెల్ అధ్యక్షుడు హయేషా బుడే, ఎంపీటీసీ చిట్టిబాబు, షంషుద్దీన్, తాటిపర్తి చంద్రారెడ్డి, పులఖండం జయరామిరెడ్డి, యర్రం హరిబాబు, సింహాద్రి సుబ్బారెడ్డి, తాటిపర్తి సుబ్బారెడ్డి, మారెళ్ళ అజయ్‌రెడ్డి, ముప్పవరపు శ్రీరాములు, సింహాద్రి బ్రహ్మారెడ్డి, నిదానపు కిషోర్, యశ్వంత్, గిరి, కోటి పాల్గొన్నారు.

అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ

చీరాల అర్బన్: రాష్ట్రంలో ఎరువుల బ్లాక్ మార్కెట్ అమ్మకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు అండగా ఈనెల 9న నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు ఆధ్వర్యంలో వారు మాట్లాడారు. ఎరువుల బ్లాక్ మార్కెట్ అమ్మకాలపై మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతన్నకు అండగా అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు కోడూరి ప్రసాద్‌రెడ్డి, బాపట్ల జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు, పట్టణ యువజన విభాగ అధ్యక్షుడు రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాస్టర్, వేటపాలెం మండల అధ్యక్షుడు సాధు రాఘవరావు, వేటపాలెం మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు జంగా మహేష్, బాపట్ల జిల్లా బీసీ సెల్ మెంబర్ గోలి గిరి, జిల్లా మాజీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, టి.వినయ్, పోతురాజు, సాయి, జి.రాజేష్, మల్లెల జకరయ్య, నీలం దాని, ఇందేటి సురేంద్ర పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు నగదును వెంటనే చెల్లించాలి


మాట్లాడుతున్న కోటేశ్వరరావు

మార్టూరు: ఇటీవల రైతుల నుంచి కొనుగోలు చేసిన నల్లబర్లీ పొగాకుకు సంబంధించిన నగదును ప్రభుత్వం వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మార్టూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నల్లబర్లీ పొగాకు కొనుగోలు నగదు జమతో పాటు ఇంకా రైతుల వద్ద మిగిలిపోయి ఉన్న పొగాకు చెక్కులను మార్క్ ఫెడ్ ద్వారా తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారని రబీ సీజను సాగు కోసం యూరియా, డీఏపీలను రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. మార్టూరు మండల రెవెన్యూ కార్యాలయంలో రైతుల సమస్యలు పరిష్కారం చేయడం లేదని ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేయాలన్నారు. సాగర్ కాలువ నీటిని యద్దనపూడి బ్రాంచి కాలువకు విడుదల చేయాలని కోరారు. పాలెపు సాంబయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రైతు సంఘ నాయకులు వీరవల్లి కృష్ణ మూర్తి, బత్తుల హనుమంతరావు, నాగేశ్వరరావు, మోహనరావు, గొట్టిపాటి శేషాద్రి, బి. సూరిబాబు, సుబ్బారావు స్థానిక రైతులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తమలపాకుల అర్చన


లక్ష తమలపాకుల అర్చనలో ప్రసన్నాంజనేయ స్వామి

అద్దంకి: శింగరకొండ క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి ఆదివారం శతభిష నక్షత్రం.. భాద్రపదమాసం పూర్ణిమ సందర్భంగా లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ప్రాతఃకాల సుప్రభాతం, గోపూజ, బిందెతీర్థం అనంతరం స్వామి వారికి అభిషేక కార్యక్రమం నిర్వహించారు. అలంకరణ తదుపరి వేదపండితులు అర్చకులు ఉభయ దాతలు వేదస్వస్తి మంగళవాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ వినాయక స్వామి వారికి సుబ్రహ్మణ్య స్వామి వారికి నారికేళఫల సమర్పణ చేశారు. మహానివేదన, పంచహారతులు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయదాతలుగా గుంటూరు వాస్తవ్యులు న్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ యజమానులు పొనకాల శ్రీనివాసరావు యశోద దంపతులు పాల్గొన్నారు. పూజ అనంతరం దేవస్థానం వేదపండితుల అర్చకులు ఉభయదాతలను భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 12.30 గంగలకు ఆలయం మూసివేసి.. సోమవారం ఉదయం 8.30 గంటలకు ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం ప్రారంభం అవుతుందని తెలిపారు.

వైదన సర్పంచ్ కుటుంబ సభ్యులకు పరామర్శ


వైదన సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రసాదరెడ్డి

బల్లికురవ: గుండెపోటుతో చనిపోయిన వైదన గ్రామ పంచాయతీ సర్పంచ్ మేడా జయలక్ష్మి కుటుంబ సభ్యులను ఆదివారం వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి పరామర్శించారు. వైఎస్సార్ సీపీ సానుభూతి పరురాలిగా 2021లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికై నాలుగున్నర సంవత్సరాలు వైదనతోపాటు ఆ పంచాయతీలోని చవిటి మాదిగపల్లె అభివృద్ధికి అందించిన సేవలను ఆమె కుటుంబ సభ్యులు తెలియజేశారు. పార్టీ పరంగా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు ప్రసాదరెడ్డి ధైర్యం చెప్పారు. పరామర్శలో స్థానిక నేతలు మాదాల శివన్నారాయణ, కొణిదుల శంకరరెడ్డి, మేకల వెంకటరెడ్డి, బ్రహ్మయ్య, మరియబాబు పాల్గొన్నారు.